


*పాఠకుల అనుభవాల మాలిక*

## జంపని శశిధర్



పెళ్ళంటే ముందునుంచీ నాక్కొన్ని స్థిరమైన అభిప్రాయాలుండేవి. పెద్దలు కుదిర్చిన పెళ్ళే చేసుకోవాలనీ, అందరూ ఒప్పుకున్న అమ్మాయినే మా ఇంటి కోడలుగా తెచ్చుకోవాలనీ..! నా మిత్రులు చాలా మంది అనుకునేట్లు..ఎక్కడో సినిమాహాల్లోనో, కాలేజీలోనో, ఆఫీసులోనో..ఎవర్నో చూసేసి, హఠాత్తుగా ప్రేమించేసి, 'ఆహా..ఇన్నాళ్ళుగా ఈ అమ్మాయి నాకోసమే వేచి వుందేమో..' అనుకుంటూ, ఊహించుకుంటూ...- ఇలాంటి కలలూ, ఊహలూ ఎప్పూడూ నాకుండేవి కాదు. నేకోరుకున్నదల్లా చక్కగా చదువుకున్న అమ్మాయి..డాక్టరో, ఇంజినీరో..అని కూడా ప్రత్యేకంగా ఏమీ షరతులు పెట్టుకోలేదు.. నాతోటీ, నా కుటుంబ సభ్యులతోటీ..కలిసి పోయి, జీవితం ఒక మధురమైన అనుభూతి అనిపించే అమ్మాయి కావాలని అనుకుంటుండే వాడిని. అంతకు మించి పెద్ద అంచనాలేమీ ఉండేవి కాదు. మా అమ్మా, నాన్నలు కూడా నాక్కాబోయే భార్య విషయంలో పరిధులేమీ విధించుకోలేదు..అందం గురించి కానీ, కట్నం గురించికానీ ఎప్పుడూ, ఎలాంటి ఆశలు లేవు మాలో ఎవ్వరికీ..! ఇంక పెళ్ళి ఎప్పుడు చేసుకోవాలి..!? కరెక్టుగా ఈ వయసుకి అనుకోకపోయినా, చెల్లి సుష్మ పెళ్ళయాకనే నా పెళ్ళి గురించి లోచించమని అమ్మానాన్నలకి చెప్పాను. 1999లో సుష్మ పెళ్ళి విజయ్‌తో జరిగినప్పుడే నేను మేరీలాండ్ లోని వెల్స్‌ఫార్గో బ్యాంకులో ఉద్యోగంలో చేరాను. ఉద్యోగంలో చేరాకనే పెళ్ళికి ఇండియా వెళ్ళాను. ఇంక బంధువులంతా.. "చెల్లి పెళ్ళి అయిపోయిందిగదా..ఇంక తరువాత పప్పన్నం నువ్వే పెట్టాలి.." అని ఆట పట్టించడం మొదలు పెట్టారు. అమ్మానాన్నలు కూడా ఈ విషయం గురించి ప్రస్తావించారు కానీ, పెద్ద సీరియస్ గా ఏమీ అనుకోలేదు.. "ఎవరేనా అమ్మాయిని చూడడం వరకే మాబాధ్యత, తుది నిర్ణయం మాత్రం నీదే" అన్నారు...

అమెరికాకి తిరిగి వచ్చేశాక..ఒకరోజు నాన్నగారు ఫోన్ చేసి..'శశీ..ఈ నంబరుకి ఫోన్ చేసి రాధికతో మాట్లాడు..' అన్నారు..అదో 10 అంకెల మాజిక్ నంబరు..!

రాధికకి ఆంటీ వరుసయ్యే ఆవిడ ఒకరు, నాన్న గారి సహ ఉద్యోగిని. ఆవిధంగా రాధిక వివరాలు నాకు అందాయి. వాళ్ళ అమ్మనాన్నలు నాగురించీ, మా అమ్మానాన్నలు రాధిక గురించీ కుప్తంగా అప్పటికే తెలుసుకున్నారట..కానీ ఒకరినొకరు కలుసుకోలేదు..ఎంచేతంటే తుది నిర్ణయం మాది కాబట్టి..

ఆవిధంగా  నంబరు చేతికి రాగానే..తమాషాగా..‘మనీ‘ లోని పాట గుర్తొచ్చింది..‘దెన్ స్టార్టెడ్ ట్రబుల్..‘ అని..! ఫోన్ చేసి మాట్లాడాలి..ఏం మాట్లాడాలి..!? ఎప్పుడూ..ఎక్కువగా ఎవరూ అమ్మాయిలతో మాట్లాడలేదు.. సరే..అనుకుని పెద్ద ప్రిపరేషన్లూ, స్క్రిప్టులూ ఏమీ లేకుండా.. ఫోన్ తీసుకుని డయల్ చేశాను.. ‘ఎంతసేపు మాట్లాడుతాంలే.. మహా ఐదు నిమిషాలు..‘ అనుకున్నది ‘హలో..‘ నుంచీ మొదలు పెట్టి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చేసరికి సరిగ్గా గంట దాటింది. ఇంతసేపు ఓ కొత్త అమ్మాయితో మాట్లాడింది నేనేనా..అని ఆశ్చర్యం వేసింది.. రెండువైపులనుంచీ సంభాషణ చాలా సరళంగా సాగింది..అందుకే మళ్ళీ ఫోన్ లోనే పలకరించుకోవాలనుకున్నాం.. ఈ ఫోన్ సంభాషణలు జరుగుతున్న సమయంలోనే ఫోటోలు కూడా మార్చుకున్నాం. తన ఫోటో చూసే వరకూ తను ఎలా వుంటుందీ అని ఊహలుకూడా ఏమీ పెట్టుకోలేదు.. ఫోటో రాగానే..అంత వరకూ విన్న కంఠ స్వరాన్ని రూపానికి జోడించి చూడగలిగాను.! మరో రెండు ఫోన్ పలకరింపుల తర్వాత..వ్యక్తిగతంగా కలుసుకోవాలనుకున్నాం.. ఇద్దరం చెరొక చోటాఉంటున్నా, పెళ్ళివిషయంలో ముందుకి వెళ్ళడానికి అదేమి పెద్ద అభ్యంతరం అనిపించలేదు..ముందుగా ఒకరికొకరం నచ్చితే..ఉద్యోగాల మార్పిడి గురించి తర్వాత ఆలోచించ వచ్చు అనుకున్నాం.. ..2000 సంవత్సరం జనవరి చివర్లో సిలికాన్ వేలీకి వెళ్ళాను.. నన్ను పికప్ చేసుకునేందుకు రాధికే వచ్చింది. అంతవరకూ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడుకున్నా, వ్యక్తిగతంగా కలుసుకున్నాక దాదాపు ఒక గంట వరకూ మాటలు కరువయ్యాయి.. తరువాత భోజనాలు చేసేప్పుడు..కాస్త కొత్తదనం తగ్గి ఫోన్‌లో మాట్లాడుకున్నట్టు చనువుగా మాట్లాడుకో గలిగాము.. సాయం కాలమే ఇద్దరం మా మా ఇళ్ళకు ఫోన్లు చేసి మా పరస్పర అంగీకారాన్ని తెలియచేశాము.. రెండు వైపులనుంచీ ముందునుంచీ నిబంధనలేమీ లేవుకాబట్టి మేము ఉభయులం ఇష్టపడ్డామని తెలుసుకుని వాళ్ళుకూడా ఆనందించారు. ఆసమయానికి మా అమ్మానాన్నా కూడా రాధిక ఫోటోలు చూశారు..



తను పంపిన మొదటి ఫోటో

నాన్నగారైతే ఫిబ్రవరిలోనే ముహూర్తాలు పెట్టిస్తానన్నారు. ఐతే రాధిక అప్పటికే హెచ్1 కోసం ఎదురుచూస్తుండడం వల్ల , వీసా వచ్చాక వెళ్ళాలని ముహూర్తాన్ని ఏప్రిల్ కి మార్చమని చెప్పాం. ఇలా ఐతే పెళ్ళి ఏర్పాట్లకి కూడా ఇద్దరికీ కొంత వీలు దొరుకుతుంది. అనికూడా అనిపించింది. ఫిబ్రవరిలోనే మొదటి సారిగా రాధిక తల్లిదండ్రులూ, మా అమ్మానాన్నా కలుసుకుని మాట్లాడుకున్నారు...మేమిద్దరం లేకుండానే మా ఫోటోల సాక్షిగా మాకు నిశ్చితార్థం చేశారు మా పెద్ద వాళ్ళు. అప్పుడే ముహూర్తం ఏప్రిల్ 16., 2000 గా నిర్ణయించబడింది(ఏప్రిల్‌పదహారా..!?పంతొమ్మిదా..!?)మా సంభాషణలో తెలిసింది మా ఇద్దరికీ కామన్ స్నేహితులు  చాలమంది ఉన్నారని. వాళ్ళందరికీ ఫోన్ చేసి మా పెళ్ళి నిర్ణయం గురించి చెప్పినప్పుడు చాలా

థ్రిల్లింగ్ గా ఫీలవ్వడమే గాక ఇద్దర్నీ మనసారా అభినందించారు.. మళ్ళీ ఇద్దరి స్నేహితుల ప్రపంచాలూ కలిసిపోయి.. ఇద్దరికీ చాలా మంది స్నేహితులు దొరికినట్లనిపించింది. పెళ్ళి కుదిరింది మొదలు....... చెల్లాయి సుష్మ కూడా ఏడిపిస్తుండేది.. 'అంతేలేరా..ఇంక నాకు ఫోన్‌చేయడానికి టైమెక్కడ ఉంటుందిలే.." అని.




ఏప్రిల్ 9 న ఇద్దరం ఒకే ఫ్లైట్లో ఇండియాకి వెళ్ళాం..మధ్యలో ఫ్రాన్స్ నుంచీ చెల్లాయి సుష్మ వచ్చి మమ్మల్ని బొంబాయిలో కలుసుకుంది.. అందరం కల్సి హైదరాబాదు ఎయిర్‌పోర్ట్‌లో దిగడం ..అదొక గొప్ప అనుభవం..ఎందుకంటే మా వాళ్ళు రాధికనీ, వాళ్ళవాళ్ళు నన్నూ మొదటి సారి చూసుకున్నది అప్పుడే.!

పెళ్ళయాక అమెరికా వచ్చేశాం.ఓ మూడు నెలల్లో నేనూ సిలికాన్‌వేలీ కి వచ్చేశాను.. ఈ విషయాలన్నీ గుర్తుచేసుకుంటుంటే.. 'అప్పుడే ఐదేళ్ళు గడిచిపోయాయా..' అనిపిస్తుంది..! ఏడాదిన్నర బాబు ఆదిత్యతో ,ఇద్దరి ఉద్యోగాలతో..బతుకు సర్కస్ ప్రతిరోజూ పున్నమిలా గడుస్తోంది..!

## రాధిక

1997 లో ఉస్మానియా యూనివర్సిటీ కాంపస్‌లో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసేప్పటికి పెళ్ళి గురించీ, రాబోయే జీవిత భాగస్వామి గురించీ పెద్ద ఆలోచనలేమీ ఉండేవి కావు. ఊపిరి సలపనివ్వని బిజీ చదువుల సంగతి అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇండియాలో చదువు ముగించుకుని, ఎం.ఎస్ చేయడానికి అమెరికా వచ్చాను. అలవాట్లలోనూ, ఆచారాల్లోనూ ఎంతో వ్యత్యాసం ఉన్న ఈ అమెరికా సమాజాన్నీ, ఇక్కడి జీవన విధానాల్నీ గమనించాక, వివాహం గురించిన ఆలోచనలూ , రాబోయే మిస్టర్ రైట్ ఎలా వుండాలి అనే ఊహలూ , క్రమ క్రమంగా రూపు దిద్దుకోసాగాయి. ఎం.ఎస్ డిగ్రీ చేతికి వచ్చేసరికి కేవలం కలలూ ఊహలే కాకుండా, పెళ్ళి గురించిన అభిప్రాయాలూ , ఆశించిన ఆదర్శాలూ ఒక స్థిరమైన రూపం సంతరించుకున్నాయి. సరిగ్గా అదే సమయానికి ఇండియాలో వున్న అమ్మ, నాన్నలు కూడా నా పెళ్ళి గురించి ప్రస్తావించడం మొదలు పెట్టారు.

నా కాబోయే భర్తని నేనే ఎంపిక చేసుకోవాలి, అభిప్రాయాలూ, అలవాట్లూ, భవిష్యత్ ప్రణాళికలూ..అన్నీ అర్థం చేసుకుని కూలంకషంగా చర్చించుకున్నాకనే నిర్ణయం తీసుకోవాలి. కట్నాలూ, కానుకలూ..ఇలాంటి వాటి గురించి బేరసారాలు చెయ్యని మనిషి కావాలి. చక్కటి హాస్య చతురత ఉండలి.. ఇలా అనుకుంటూండేదాన్ని. అమ్మా, నాన్న లేమో arranged marriage వైపే మొగ్గు చూపేవారు. అప్పటికే నేనెవర్నీ ఎంపిక చేసుకోవడంలాంటివేమీ లేవు కనుక అమ్మానాన్నలు సూచించిన arranged marriage పద్ధతి ద్వారానే

నేననుకున్న భర్తని ఎన్నుకోవాలని నిశ్చయించుకున్నాను. . షరా మామూలే..అమ్మా, నాన్నలు ముందుగా వరుడి గురించి తెలుసుకుని, నా అభిప్రాయాలు (ముఖ్యంగా వరకట్నం వగైరా లకు నేను వ్యతిరేకం అన్న విషయాలు) వారికి తెలియచేసి, వాళ్ళు సరే అంటే నాకు అతడి వివరాలు ఇస్తారు. తరువాత నేను వాళ్ళా ఫోను కోసం వేచి చూడాలి (నేను మాత్రం ముందుగా వాళ్ళకి ఫోన్ చెయ్యకూడదు..).. అమెరికాలో చదువుకున్న చాలామంది అమ్మాయిలు ఇలాంటి పరిస్థితి ఎదుర్కొనే ఉంటారనుకుంటాను.

ఆరోజు రానే వచ్చింది.. జనవరి 2, 2000.. ఫోన్ మోగింది.. "హలో అండీ..నా పేరు శశి.." అలా మొదలైన సంభాషణ మా చదువుల గురించీ, కుటుంబాల గురించీ, అలవాట్ల గురించీ..అలా..అలా..సాగింది. చాలా కొద్ది సేపట్లో పెట్టేయచ్చు అనుకున్న ఫోన్ సంభాషణ గంటకు పైగా సాగింది. అప్పట్లో నేను సిలికాన్ వేలీలో కె.ఎల్.ఎ.టెన్ కోర్ లో పనిచేస్తుండేదాన్ని. శశి మేరీలాండ్‌లో వెల్స్ ఫార్గో బాంక్ లో పనిచేస్తుండేవాడు. ఈ సంభాషణలో నాకు నచ్చిందేమిటంటే, ఎలాంటి assumptions (పెళ్ళి చేసేసుకుంటాంలే అనే విధంగా) లేకుండా ఇద్దరమూ నిర్మొహమాటంగా మా అభిప్రాయాల్ని చర్చించుకోవడం. ముందే ఒక పెళ్ళిచేసేసుకుంటాంలే అనే అభిప్రాయంతో మాట్లాడుకోడానికీ, ఇలా ఒక ప్రయోజనాన్నాశించి మాట్లాడుకోడానికీమధ్య సన్నని తెర ఉందని అనుకుంటాను. మొత్తానికి సంభాషణ ముగిసే సరికి శశి పై సానుకూలమైన అభిప్రాయం కలిగింది. మరలా మాట్లాడుకుందామనీ, ఒకరి ఫోటోలు మరొకరికి పంపుకుందామనీ అనుకున్నాం.


శశి పంపిన ఫోటో

జనవరి మొదటివారంలో ఇవన్నీ జరిగాయి..రెండో వారానికల్లా ఇద్దరిమధ్యా స్నేహం బలపడింది. మా పరిచయం ఎన్నో సంవత్సరాలు అన్న భావం ఇద్దరికీ కలిగింది. ఒకరికొకరు నచ్చడానికి ఇదే నిదర్శనమేమో అనుకున్నాను. రోజులు జరిగిన కొద్దీ ఫోన్ సంభాషణలు కూడా సుదీర్ఘం కాసాగాయి. చివరికెలాగైతేనేం..ఒకరి నొకరు చూసుకోవాలనుకున్నాం.. జనవరి 28న శశిధర్ సిలికాన్ వేలీ కి వచ్చాడు. తనని పిక్‌అప్ చేసుకోడానికి నేనే ఎయిర్ పోర్ట్ కి వెళ్ళాను. గత రెండు మూడు వారాలుగా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నా,ఎదుట పడుతున్నారనేసరికి ..లోలోపల ఏదో కొంచెం..భయం..బెరుకు. ఒకరికొకరు ఎదుట పడగానే..ఇద్దరిదీ ఇదే పరిస్థితి..ఎక్కడో..ఇంకా అపరిచిత భావం! కారులో ఇంటికి వచ్చే సరికి ఈ అసహనం తగ్గింది..ఇద్దరం మళ్ళీ ఒకే స్థాయిలో మాట్లాడుకునే స్థితి వచ్చింది. ఒక గంట తరువాత అసలు ప్రశ్న... తలెత్తింది. ముందుగా తనే 'అవును' అన్నాడు. వెంటనే నేనూ..!

ఇండియాకి ఫోన్ చేసి వాళ్ళ తల్లిదండ్రులకీ, మావాళ్ళకీ కూడా మా పరస్పర అంగీకారాన్ని తెలియ చేశాం.. మొట్ట మొదటిసారి మా అత్తగారు, మామ గారితో మాట్లాడిన క్షణాలు కూడాఇంకా గుర్తున్నాయి....ఏదో తెలియని అసౌకర్యం..వాళ్ళకీ అలానే ఉండిందట.! కానీ అతి కొద్ది సమయంలోనే చాలా దగ్గరయ్యాం... అప్పటినుంచీ..నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది.. మా మీద నమ్మకం ఉంచి మా నిర్ణయాన్ని గౌరవించిన మా అత్తగారు,మామ గారు అంటే నా కెప్పటికీ తరగని గౌరవం ఉంటుంది. శశి వాళ్ళచెల్లెలు కూడా ( అప్పట్లో ఫ్రాన్స్ లో ఉండే వాళ్ళు) తరచూ నాతో మాట్లాడుతుండేది.. మా ఇద్దరి తల్లి దండ్రులూ

హైదరాబాదే అవడంవల్ల, వాళ్ళూ వాళ్ళు మాట్లాడుకోడానికీ మంచి రోజులు నిర్ణయించుకోడానికీ చాలా సులభమైంది. మా నిశ్చితార్థం ఫిబ్రవరి 17, 2000 న హైదరాబాదులో జరిగింది.., విశేష మేమిటంటే.. కార్యక్రమానికి మేమిద్దరమూ అక్కడ లేము..!!( విచిత్రంగా వుంది కదా..!)


మా మనసులు కలుసుకున్న శుభవేళ

పెళ్ళి ముందుగా ఏప్రిల్ 19 న అనుకున్నారు.. కానీ తరువాత ఏప్రిల్ 16 కే ముందుకి జరిపారు.. ( ఇప్పటికీ శశి ని మేరేజ్ డే ఎప్పుడంటే ఏప్రిల్ 19 అనే అంటాడు.. నేను ఏడిపిస్తుంటాన్లెండి..!)

ఏప్రిల్ 9 న ఇద్దరం కల్సి ఒకే ఫ్లైట్ లో మా పెళ్ళికోసం ఇండియా వెళ్ళాం.. ఏప్రిల్ 16 న వివాహమయ్యాక మే 4న వెనక్కి తిరిగి వచ్చాం. శశిధర్ త్వరలోనే కాలిఫోర్నియాకి వచ్చేశారు..

ఈ ఐదేళ్ళ వివాహ జీవితంలో..అభిప్రాయబేధాలు చాలా సార్లే వచాయి..కానీ అన్నీ క్షణికాలే.. అన్నీ వెంటనే మర్చిపోతుంటాం..మాకిప్పుడు ఏడాదిన్నర బాబు ʻఆదిత్యʻ.. వెనక్కి తిరిగి చూస్తే...టైము చాలా త్వరగా కరిగిపోతోందనిపిస్తుంది..

చాలామంది ʻచూపులు కలిసిన శుభవేళ అంటారు కానీ నేనైతే ʻమనసులు కలిసిన శుభవేళʻ అంటాను..ఎందుకంటే మాకు మనసులు కలిసాకే చూపులు కలిసాయి..!

శశిధర్, రాధిక ఇద్దరూ సిలికాన్ వేలీలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగస్తులే.. శశిధర్ బాంక్ ఆఫ్ అమెరికా లో డాటబేస్ లో సీనియర్ స్థాయి ఆఫీసర్ గా పనిచేస్తుంటే, రాధిక లీప్‌ఫ్రాగ్ కంపెనీలో పనిచేస్తోంది. శశిధర్ కి ఫొటోగ్రఫీ, ఆంగ్ల నవలల పఠనం హాబీలు. రాధిక మంచి గాయని, వైణికురాలు.

జీవితం అనుభవాల సంపుటి! కొన్ని అనుభవాలు అనుభూతులుగా మారి మనసు పొరల్లో కలకాలం కొలువుంటాయి. వర్తమానం గందరగోళంగా అనిపించినప్పుడు  అనుభూతులు నిద్రలేచి మనల్ని ఊరడిస్తాయి. అందరి అనుభవాలూ ఒక్కటిగా ఉండాల్సిన అవసరం అస్సలు లేదు కానీ..ప్రతి వారి జీవితంలోనూ తమ జీవిత భాగస్వామిని కలుసుకోవడం అనేది ఒక మరపురాని అనుభవం అనేది అందరూ అంగీకరించే వాస్తవం. అది .. పెద్దలు ఏర్పాటు చేసిన పెళ్ళిచూపులు కావొచ్చు, రైలు ప్రయాణం కావొచ్చు, కాలేజీ లో యూత్ ఫెస్టివల్ కావొచ్చు,ఇంకోటి..మరోటి.. మీరు మీ శ్రీమతిని / శ్రీ వారిని మొదటిసారిగా ఎక్కడ చూశారు, ఏం మాట్లాడుకున్నారు..ఒక సారి మన 'సుజనరంజని' పాఠకులతో పంచుకోండి. ..మరోసారి మీ అనుభూతుల సుమ పరిమళాల్ని ఆస్వాదించండి. మీకోసం, మీరే నిర్వహిస్తున్న ఈశీర్షిక కు ఫోటోలతో సహా పంపించండి.. ! మీ ఆర్టికిల్ తో బాటు హామీపత్రం, మీ పూర్తి వివరాలు జతజేయడం మరచిపోకండి. అనుభవాలు మీవి..వేదిక మాది..అనుభూతులు మనందరివీ!